
సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



భీమనాథుని కల్యాణం కందామా..

ద్రాక్షారామలో శనివారం మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి వార్ల కల్యాణోత్సవాలు జరగనున్నాయి.


8 లో



365 కేజీల గంజాయి పట్టివేత

గండేపల్లి మండలంలో పోలీసులు 365 కేజీల గంజాయి పట్టుకున్నారు. మొత్తం రూ.26,79,750 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

డెల్టాలకు 8,650 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.85 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

సివిల్ సర్వీసెస్ హాకీకి ఏర్పాట్లు చేయాలి

కాకినాడ సిటీ: నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదేశించారు. ఈ టోర్నమెంట్ నిర్వాహక ఉప కమిటీలతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే జాతీయ స్థాయి క్రీడాకారులకు చక్కటి బస, ఆతిథ్యం, సదుపాయాలు కల్పించాలని అన్నారు. వారి బసకు, అక్కడి నుంచి క్రీడా మైదానానికి వెళ్లేందుకు కాకినాడ, సామర్లకోట రైల్వే, బస్ స్టేషన్ల నుంచి బస్సులు, కార్లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడాకారుల నమోదు, పోటీల నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహారం, వైద్య సేవలకు ఉపకమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రారంభ, ముగింపు వేడుకల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, క్రౌడ్ నియంత్రణ, పార్కింగ్, లైటింగ్ తదితర అంశాలపై ఆయా కమిటీల అధికారులతో జేసీ మీనా సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, సీపీవో పి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జ్ఞాన చైతన్య మహాసభలు

పిఠాపురం: స్థానిక శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠంలో ఆది, సోమ, మంగళ వారాల్లో 97వ వార్షిక జ్ఞాన చైతన్య మహాసభలు నిర్వహిస్తున్నారు. పిఠాపురంలోని పీఠం ప్రధానాశ్రమం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు ఈ విషయం తెలిపారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షతన వార్షిక జ్ఞాన చైతన్య మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ సభల్లో దేశ విదేశాల నుంచి సుమారు 36 వేల మంది సభ్యులు పాల్గొంటారని తెలిపారు. సభల్లో పాల్గొనే వారికి పీఠం వద్ద భోజన ఏర్పాట్లు చేశామన్నారు. పీఠాధిపతి ఉమర్ ఆలీషా మాట్లాడుతూ 1472లో స్థాపించిన ఈ పీఠం 553 సంవత్సరాలుగా ఆర్ష సూఫీ వేదాంత సారాన్ని ఏకత్వ రూపంగా ప్రబోధిస్తోందని చెప్పారు. 1928లో పంచమ పీఠాధిపతి నిర్యాణానంతరం, ఏటా మాఘ మాసం శుక్ల పక్షంలో తాత్విక విజ్ఞానాన్ని బోధిస్తూ మూడు రోజుల పాటు మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కుల, మత, జాతి, వర్ణ, లింగ, వర్గ తారతమ్యాలు లేని, సర్వ మానవ సమానత్వం కోసం అందరికీ ఆచరణ యోగ్యమైన తత్వాన్ని తమ పీఠం బోధిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై జాన్ బాషా, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్‌టీవీ వర్మ, పింగళి ఆనంద్, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ

నల్లజర్ల: సీపెట్ - విజయవాడ, ఎంఎస్‌ఎంఈ, ఎన్ఎస్ఐసీ సంయుక్త సౌజన్యంతో 30 మంది ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు సీపెట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్, ఎన్ఎస్ఎస్‌హెచ్ స్కీం ద్వారా మెషీన్ ఆపరేటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో 5 నెలల పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, అనంతరం సర్టిఫికెట్ ఇచ్చి, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని వివరించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయాలను సీపెట్ సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి పాసై కనీసం 18 సంవత్సరాల వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత సీపెట్ ప్రతినిధి సుందరరావును 93980 50255 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు భారీగా నామినేషన్లు

ఏలూరు (మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు శుక్రవారం 18 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇదివరకే నామినేషన్ వేసిన పేపకాయల రాజేంద్ర, ములగల శ్రీనివాసరావు మరో రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఏలూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వికి శుక్రవారం పేరాబత్తుల రాజశేఖర్, వానపల్లి శివగంగ వీరగణేష్, బందారు రామ్మోహన్‌రావు, నేతిపూడి సత్యనారాయణ, పచ్చిగొల్ల దుర్గారావు, బొమ్మిడి సన్నిరాజ్, జీవీ సుందర్, కుక్కల గోవిందరాజు, కాండ్రేగుల నరసింహులు, గద్దే విజయలక్ష్మి, కట్టా వేణుగోపాలకృష్ణ, మాకే ప్రసాద్, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, చిక్కా భీమేశ్వరరావు నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ పత్రాలు సమర్పించిన అభ్యర్థులతో ఆర్వో ప్రమాణం చేయించారు. ఇంతవరకూ మొత్తం 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

చూచిన కన్నుల భాగ్యమిదే..

- వైకుంఠాన్ని తలపించిన అంతర్వేది క్షేత్రం
- అంగరంగ వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం
- సాగర ఘోషను మించిన గోవింద ఘోష
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- ఏర్పాట్లు చేసిన అధికారులు, సేవకులు



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న రాజా కుమార రామ గోపాల రాజా బహద్దూర్



స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్త జనం

ఆ కనులు ఆత్రంగా.. ఆర్ద్రతతో.. ఆర్తిగా.. ఆరాధనగా.. అనిర్వచనీయమైన భక్తిభావంతో అంతలంతలై చూస్తున్నాయి. ఎక్కడ ఎక్కడ ఎక్కడా అని. ఏ వైపు నుంచి వస్తున్నాడా అని. వేదమూర్తుల మంత్రాలు.. డోలు సన్నాయి.. బాజా భజంత్రీలు.. మేళ తాళాలు.. అమ్మలక్కల హడావుడి.. ఆహూతులకు ఆహ్వానాలు.. కల్యాణ క్రతువుకు కావాల్సిన సామగ్రి అన్నీ వచ్చాయో లేదో.. ఏదైనా మరచిపోయామా అని పదేపదే లెక్కవేసుకుంటున్న పెళ్లిపెద్దలు.. ఇవన్నీ కనిపిస్తున్నాయి.. వినిపిస్తున్నాయి.. అసలైనవారేరీ.. ఇంకా రారే.. ఆ కళ్లు వెదుకుతున్నవి వారి కోసమే. అదే.. వారేనండీ.. దేవదేవుడు.. దేవేరీ.. యుగయుగాలుగా ఎన్నో కల్యాణ వైభోగాలు చూస్తున్నా ఎప్పటికప్పుడే కొత్త. చాలదా ఈ జన్మకి ఆ భాగ్యమని ఎదురు చూపు. ఆ భక్తకోటి కనులు భౌతికంగా ఇక్కడే ఉన్నా.. ఆ.. లోచనాలు వైకుంఠంలో వెతుకుతున్నాయి.. అమ్మతో కూడిన స్వామిని చూడాలని.. వారి కల్యాణాన్ని కనులారా చూడాలని.. అదిగదిగో రానే వచ్చారు. అమ్మవారిని వారు.. అయ్యవారిని వీరు వేదికపైకి తీసుకువచ్చారు. చాలు చాలు.. వివశులైపోయి చూస్తున్నారదిగో కల్యాణాన్ని..

సాక్షి, అమలాపురం/సఖినేటిపల్లి/మలికిపురం: భువిపై ఆది దేవుడై వెలసిన అంతర్వేది పుణ్యక్షేత్రం కోలాహలంగా మారింది. వేదికపై శ్రీ, భూ సమేత లక్ష్మీ నృసింహుని పరిణయాన్ని చూసేందుకు వచ్చిన భక్తజనంతో కిటకిటలాడింది. చూసే కన్నులదే భాగ్యం అన్నట్టుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి సుమారు నాలుగు గంటల పాటు నిర్విరామంగా సాగిన వేడుకను వేలాది భక్తులు ప్రత్యక్షంగా, కోట్లాది మంది పరోక్షంగా వీక్షించి పులకించిపోయారు. స్వామివారి కళ్యాణంతో పరమ పవిత్ర వశిష్ఠ గోదావరి తీరం ఆధ్యాత్మిక వాహిని వరవళ్లు తొక్కింది. తీరంలోని సముద్ర ఘోషను భక్తజన గోవింద ఘోష మించిపోయింది. నామస్మరణలు.. వేద పండితుల పన్నాలు.. రంగురంగుల పూవులతో శోభాయమానంగా అలంకరించిన కల్యాణ వేదిక.. పట్టు వస్త్రాలు, బంగారం, వజ్రాభరణాలతో స్వామి, అమ్మవార్లు మెరిసిపోయారు. కల్యాణ మండపం చుట్టూ భారీ పందిళ్లు.. విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా మారిన అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని కల్యాణం నయనానందకరంగా సాగింది.

అంగరంగ వైభవంగా

రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. ఆచారం ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన దేవస్థానం చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ శ్రీవారి తరఫున, అర్చక స్వాములు అమ్మవారి తరఫున కల్యాణ కర్తలుగా నిలిచారు. స్వామివారి కల్యాణం శుక్రవారం అర్ధ రాత్రి 12-55 (తెల్లవారితే శనివారం) గంటలకు మృగశిర నక్షత్ర యుక్త వృశ్చిక లగ్నం పుష్కరాంశలో జరిగింది. వైష్ణవ సంప్రదాయ వైఖానస ఆగమానుసారం ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణాన్ని నిర్వహించింది. సుముహూర్తానికి జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామివారి శిరస్సుపై ప్రధాన అర్చకుడు కిరణ్, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవి శిరస్సులపై సహాయ అర్చకులు ఉంచారు. ఎప్పటిలాగానే శఠారి, వైరుముడి, సూర్య పతకం, చిన్ని కిరీటం, వెండి కిరీటం, సాదా కిరీటం, కంటె, పచ్చలు, కెంపులు, వజ్రాలతో పొదిగిన కిరీటం, హంస పతకం, నవరత్నాలు పొదిగిన హారం, పగడాల మాల, తొమ్మిది ఈస్ట్ ఇండియా మోహాళీలు, 12 రకాల నానుతాడులు, చిన్ని లక్ష్మీ కాసుల పేర్లతో వారిని అలంకరించారు. వీటితో పాటు అంతర్వేదికరకు చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్య వెంకట సత్యనారాయణ సమర్పించిన ఆభరణాలను సైతం అలంకరించారు.

ఆనవాయితీగా అన్నవరం, టీటీడీ దేవస్థానాల తరఫున అధికారులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా తీరప్రాంత వాసులు, రాష్ట్రం నలుమూల నుంచి వచ్చిన వేలాది భక్తులు కల్యాణాన్ని తుది వరకు చూసి ఆనందపడిపోయారు. వేలాది మంది భక్తులకు దేవస్థానం నోటిఫైడ్, ప్రైవేట్ సత్రాలు ఆకలి దప్పికలు తీర్చాయి. కల్యాణాన్ని స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిశాంతి, ఎస్పీ కృష్ణారావు, దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కల్యాణానికి అంచనాలు మించి భక్తులు వస్తారని అధికారులు భావించినప్పటికీ తక్కువ సంఖ్యలో రావడం విశేషం.

నేడు రథోత్సవం

అంతర్వేదిలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతన దంపతులుగా స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రథయాత్రలో ఆనవాయితీగా అర్చకులు సోదరి గుర్రాలక్క అమ్మవారికి చీర, సారెలను స్వామి తరఫున సమర్పించారు.



పంచముఖ అంజనేయస్వామిపై గ్రామోత్సవం



గజమాల ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం



కంచుగరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

ఏపీఎస్పీ కమాండెంట్‌గా నాగేంద్రరావు



కమాండెంట్ నాగేంద్రరావుకు స్వాగతం పలుకుతున్న దేవానందరావు

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.నాగేంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆక్టోపస్ కమాండెంట్‌గా ఉన్న ఆయనను ప్రభుత్వం ఇటీవల కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా నియమించింది. బెటాలియన్‌కు వచ్చిన ఆయనకు తొలుత అదనపు కమాండెంట్ దేవానందరావు మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం హెచ్‌ఏసీ కమాండెంట్ రామకృష్ణ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ, గతంలో మూడో బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా పని చేశానని, ఇప్పుడు ఇదే బెటాలియన్‌కు కమాండెంట్‌గా రావడం ఆనందంగా ఉందని అన్నారు. సిబ్బంది పనితీరు మెరుగు పరచడంతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, బాబ్జీ, ఆర్ఐలు వితలేశ్వరరావు, రవిశంకర్, అజయ్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొని, నాగేంద్రరావుకు అభినందనలు తెలిపారు.

అస్మదీయులకు అందలం



సీతానగరం మండలంలో విద్యుత్ స్తంభాలు వేస్తున్న సిబ్బంది



సిద్ధంగా ఉంచిన విద్యుత్ స్తంభాలు

- ఏపీ ఈపీడీసీఎల్‌లో అడ్డగోలు బాగోతం
- టెండర్లు పిలవకుండా రూ.97 లక్షల పనులు కట్టబెట్టిన వైనం
- పురుషోత్తపట్నం సబ్ స్టేషన్ నుంచి అచ్చియ్యపాలెం వరకూ ఆగమేఘాలపై పనులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్)లో అస్మదీయులకు అందలం వేశారు. నిబంధనలు తుంగలో తొక్కేశారు. టెండర్‌కు టెండర్ పెట్టారు. నామినేషన్ పద్ధతిపై రూ.కోటి విలువైన పనులు కట్టబెట్టేశారు. అనుకున్నదే తడవుగా పనులు సైతం మొదలు పెట్టేశారు. ఈ అడ్డగోలు వ్యవహారానికి ఆ కార్యాలయ ఉద్యోగులే అవాక్కవుతున్నారు.

ఇదీ సంగతి

విద్యుత్ శాఖలో ఏ పని చేపట్టాలన్నా తప్పనిసరిగా టెండర్లు ఆహ్వానించాలి. ఆ శాఖ నిబంధనల మేరకు డీఈ, ఎస్ఈ ఆధ్వర్యాన ఈ ప్రక్రియ జరుగుతుంది. సంస్థలో రిజిస్టర్ అయిన కాంట్రాక్టర్‌కు మాత్రమే పనులు అప్పగించాలి. క్లాస్-1 కాంట్రాక్టరై ఉండాలన్నది నిబంధన. గతంలో సైతం ఇవే నిబంధనలు పాటిస్తూ పనులు అప్పగిస్తున్నారు. కానీ ప్రస్తుతం అధికారులు నూతన సంస్కృతికి నాంది పలికినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

టెండర్ లేకుండా పనులు

సీతానగరం మండలం పురుషోత్తపట్నం సబ్ స్టేషన్ నుంచి అచ్చియ్యపాలెం వరకూ 11 కేవీ ఫీడర్ విద్యుత్ లైన్ పనుల నిర్వహణకు రూ.97 లక్షలతో అంచనాలు రూపొందించారు. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు పాతి, వైర్లు వేసే పనులు ప్రతిపాదించారు. ప్రభుత్వ, ఆ శాఖ నిబంధనల మేరకు ఈ పనులకు టెండర్లు పిలవాలి. తక్కువకు కోట్ చేసి, టెండర్ దక్కించుకున్న వారికి పనులు కేటాయించాలి. కానీ ఇక్కడ మాత్రం అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని, టెండర్లు లేకుండానే తమ అనుయాయులైన వారికి పనులు కట్టబెట్టేశారనే ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులు మంజూరు చేసే అధికారులే అండగా ఉండటంతో సదరు కాంట్రాక్టర్ వెంటనే పనులు ప్రారంభించేసి, చకాచకా నిర్వహించేస్తున్నారు. విషయం ఎక్కడైనా లీకైతే ఇబ్బందులు వస్తాయన్న తలంపుతో ఆలస్యం చేయకుండా పనులు కానిచ్చేస్తున్నారు. పనులు కట్టబెట్టడంలో ఆ శాఖలోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా పనులు అప్పగించాల్సిన అవసరం ఏముంది? దీని వెనుక ముడుపులు పెద్ద ఎత్తున పుచ్చుకున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బిక్కవోలులోనూ అదే తీరు

అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులోనూ నామినేషన్ పనుల దందా కొనసాగుతోంది. కన్స్యూమర్ కనెక్షన్ పనుల్లో విద్యుత్ అధికారులు అడ్డగోలు వ్యవహారానికి తెర తీశారు. రూ.5 లక్షలకు మించిన పనులకు తప్పకుండా టెండర్లు వేయాలన్న నిబంధనను పక్కన పెట్టేశారు. ఓ వ్యక్తి తనకు విద్యుత్ కనెక్షన్ అవసరమని ఆ శాఖకు దరఖాస్తు చేసుకుని, అందుకు ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించారు. అధికారులు టెండర్లు ఆహ్వానించి, కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయాల్సి ఉన్నా.. రూ.30 లక్షల విలువైన ఈ పనులను తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు కట్టబెట్టినట్లు సమాచారం. కేవలం సీతానగరం, బిక్కవోలే కాదు.. జిల్లా వ్యాప్తంగా మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇదే తంతు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

థీమ్‌లతో పార్కుల అభివృద్ధి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నగరంలోని పార్కులను మూస పద్ధతిలో కాకుండా నగర ప్రజలను, పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేక థీమ్‌లతో తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి ఆ మేరకు పనులు పూర్తి చేయాలని అన్నారు. నగరంలోని 26 పార్కులు, నగరవనం అభివృద్ధికి సెవెన్ హిల్స్ అసోసియేట్స్ ప్రతిపాదించిన ముసాయిదా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి కలెక్టర్ తన కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి పార్కును ఒక ప్రత్యేకతతో అభివృద్ధి చేయాలని సూచించారు. ఇప్పటికే కంబాల చెరువు, దానవాయిపేట, ప్రకాశ్ నగర్, జేఎన్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు వంటి ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేశామన్నారు. మరింత విలువ ఆధారిత విధానంలో పార్కులు అభివృద్ధి చేయాలని అన్నారు. కేవలం విశ్రాంతికో, పిల్లల ఆటలకో పరిమితం కాకుండా.. జిమ్, యోగా, డ్యాన్స్, ఔషధ మొక్కలు, మ్యూజిక్, రాక్ గార్డెన్, వాటర్ షో, ఫ్లవర్, బర్డ్, వ్యర్థాల నుంచి విభిన్న ఆకృతుల తయారీ, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాల వంటి వినూత్న డిజైన్లతో అభివృద్ధి చేయాలని సూచించారు. పార్కులకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కడియం నర్సరీల్లో పర్యాటకాభివృద్ధిపై కూడా పర్యాటకం, హార్టికల్చర్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శైలజవల్లి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠకు బ్రేక్

- ఆలయం నిర్మించినప్పుడు ఊరుకున్నారు
- ఇప్పుడు అనుమతి లేదంటున్నారు
- బీజేపీ ఎమ్మెల్యే ఇలాకాలో ఘటన
- అధికారుల తీరుపై సర్వత్రా విస్మయం



ఆలయం యాగశాల చుట్టూ ఏర్పాటు చేసిన కంచె, పక్కనే పోలీసు పహారా

కాకినాడ: హిందూ ధర్మానికి ప్రతినిధిగా చెప్పుకొనే బీజేపీ ఎమ్మెల్యే ఉన్న అనపర్తి నియోజకవర్గంలో హిందూ దేవతా విగ్రహాల ప్రతిష్ఠను అధికారులు అడ్డుకోవడం సంచలనం రేపుతోంది. వివరాలివీ.. అనపర్తి శివారు కొత్తూరు గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో 1,600 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేని స్థలాలు కొన్ని అక్కడక్కడ మిగిలాయి. అటువంటి ఒక స్థలంలో స్థానికులు కొంతమంది కలిసి, ఈశ్వరుడు, విఘ్నేశ్వరుడు తదితర దేవుళ్లకు ఆలయ నిర్మాణం చేపట్టారు. దీనికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తి గంగిరెడ్డి సొంతంగా సుమారు రూ.20 లక్షల ఆర్థిక సహకారం అందించారు. ఆలయ నిర్మాణం పూర్తవడంతో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ చేయడానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ కార్యక్రమం సత్తి గంగిరెడ్డి, ఆయన కుటుంబం ఆధ్వర్యాన జరగాల్సి ఉంది. స్థానికులు దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ ఒత్తిళ్లో లేక ఇతర కారణాలో తెలీదు కానీ.. ఆలయ నిర్మాణం జరిగినన్నాళ్లూ పట్టించుకోని గ్రామ పంచాయతీ, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు ఒక్కసారిగా రంగంలోకి దిగారు. ఆలయ నిర్మాణ బాధ్యతలు చూస్తున్న సత్తి గంగిరెడ్డి అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో గుడి నిర్మిస్తున్నారని, అది అక్రమ నిర్మాణమని, తక్షణం ఆపాలని పేర్కొంటూ పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇచ్చారు. వెనువెంటనే జిల్లా స్థాయి అధికారులు కూడా ఆగమేఘాల మీద రంగంలోకి దిగారు. గుడి వద్ద విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహించడానికి ఏర్పాటు చేసిన యాగశాల చుట్టూ ఆంక్షలతో కూడిన కంచె, పోలీసు పహారా ఏర్పాటు చేశారు.

విగ్రహ ప్రతిష్ఠ కోసం గ్రామంలోకి దేవతా విగ్రహాలు తీసుకువచ్చి, సంప్రదాయబద్ధంగా గురువారం నిర్వహించాల్సిన గ్రామోత్సవాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఎవరైనా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తే వారి పైన, తమను అడ్డుకోవడానికి ప్రయత్నించే వారి పైన కేసులు పెడతామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. కూటమి నాయకులు, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రోద్బలంతోనే అధికారులు విగ్రహ ప్రతిష్ఠను అడ్డుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ మతాలకు చెందిన అనుమతులు లేని నిర్మాణాలు చాలా గ్రామాల్లోనే ఉన్నాయని, వాటన్నింటికీ లేని ఆంక్షలను కేవలం కొత్తూరులోని హిందూ దేవాలయానికే ఎందుకు విధిస్తున్నారని అంటున్నారు. దీనిపై హిందూ మత ప్రతినిధులుగా చెప్పుకొనే విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, బీజేపీ పెద్దలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, ఈ ఘటన యావత్ హిందువులను అవమానించనట్లేనని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హిందూ సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు రాజబాబు

కోటనందూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకెళితే.. మండలంలోని బొద్దవరం గ్రామానికి చెందిన సుర్ల రాజబాబు (30) జగన్నాధపురానికి చెందిన ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 2న పని ముగించుకొని రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న క్రమంలో స్థానిక గొంపకొండ మలుపులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయమయిన రాజబాబును స్థానికులు 108లో తుని ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటు పోలీసులు తెలిపారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 – 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260


వేడుకకు సిద్ధమైన కల్యాణ మండపం


స్వామివార్ల కల్యాణాలకు ముస్తాబైన సర్వ వాహనాలు (ఫైల్)

భీమనాథుని కల్యాణం కందామా..

- నేటి రాత్రి 11.05 గంటలకు వేడుక
- ఒకే వేదికపై మూడు జంటలకు కల్యాణం
- 14వ తేదీ వరకూ మహోత్సవాలు
- ద్రాక్షారామలో ఏర్పాట్లు పూర్తి

రామచంద్రపురం రూరల్: మానవుల కల్యాణం మాంగల్యం తంతునానేన మమజీవన హేతునా అని వారి జీవన సాఫల్యం కోసం చేస్తుంటారు. దేవుని కల్యాణం మాంగల్యం తంతునానేన లోక రక్షణ హేతునా అని లోక కల్యాణం కోసం వార్షికంగా నిర్వహిస్తారు. అలాగే పంచారామాలలో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా భాసిల్లుతున్న భూకైలాసం ద్రాక్షారామంలో క్రోధి నామ సంవత్సరం మాఘ శుద్ధ ఏకాదశి శనివారం నాడు ఒకే వేదికపై ఎక్కడా లేని విధంగా ముగ్గురు దేవతా మూర్తులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారు, చండికా సమేత సూర్యేశ్వరస్వామి వారు, లక్ష్మీ సమేత నారాయణస్వామివార్ల కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి.


స్వామివార్ల రథోత్సవం (ఫైల్)

కార్యక్రమ వివరాలు

- శనివారం ఉదయం 5.45 గంటలకు కల్యాణ మూర్తులకు ఆహ్వానం. ఉదయం 8.15 గంటలకు ప్రధమాభిషేకం, లక్ష రుద్రాక్ష పూజ, సాయంత్రం 6 గంటలకు నంది వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 11.05 గంటలకు కల్యాణ మహోత్సవాలు, నీరాజన మంత్రపుష్పములు, ప్రసాద వినియోగం, 12.00 గంటలకు కవాట బంధనం.
- 9న ఆదివారం ఉదయం 8 గంటలకు స్వామివార్ల నగరోత్సవం, రాత్రి 8 గంటలకు గరుడ వాహనంపై నగరోత్సవం.
- 10న సోమవారం ఉదయం 10 గంటలకు నగరోత్సవం, సాయంత్రం 5.45 గంటలకు సదస్యం, అనంతరం పండిత సత్కారం, నీరాజన మంత్రపుష్పాలు, రాత్రి 8 గంటలకు సర్వ వాహనాలపై నగరోత్సవం
- 11న మంగళవారం ఉదయం 10 గంటలకు నగరోత్సవం, మధ్యాహ్నం 2.55 గంటలకు రథోత్సవం, సాయంత్రం 6 గంటలకు వేగాయమ్మపేటలో రాజా వాత్రేవు సుందర రత్నాకర శర్మచే ఆస్థాన పూజ, రాత్రి 9 గంటలకు వేగాయమ్మపేట ఆస్థాన మండపం (రథము) వద్ద సాంస్కృతిక కార్యక్రమం
- 12న బుధవారం ఉదయం 6 గంటలకు వేగాయమ్మపేట నుంచి ద్రాక్షారామలో దేవాలయానికి రథాన్ని తీసుకురావడం, తీర్థపు బిందె, బాలభోగం, అభిషేకాలు, పూజల ప్రారంభం, ఉదయం 7.55 గంటలకు వసంతోత్సవం, నాకబలి, గ్రామోత్సవం, అనంతరం త్రిశూల స్నానము, చక్ర స్నానము, రాత్రి 8 గంటలకు సర్వ వాహనాలపై నగరోత్సవం, రాత్రి 11 గంటలకు చోరోత్సవం, కవాట బంధనం.
- 13న గురువారం రాత్రి 6.35 గంటలకు సప్త గోదావరి నదిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం
- 14న శుక్రవారం రాత్రి 7.05 గంటలకు ఊయల మండపంలో స్వామి అమ్మవార్లకు శ్రీ పుష్పోత్సవం, అనంతరం ప్రసాద వినియోగము జరుగనున్నాయి.

మూడు జంటలకు ఒకే రోజు..

శనివారం నుంచి 14వ తేదీ శుక్రవారం వరకు పాంచాహ్నిక దీక్షగా ద్రాక్షారామలో కొలువై ఉన్న మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూర్యేశ్వరస్వామి వార్లకు ధ్వజారోహణ, దివ్య కల్యాణ మహోత్సవాలు, రాత్రి ఆరుద్రా నక్షత్ర యుక్త తులా లగ్నమందు రాత్రి 11.05 గంటలకు ఆగమ విశారదులు, ప్రతిష్టాచార్యులు దేవస్థానం బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ, దేవస్థానం అర్చకస్వాములు, వైదిక బృందాలచే అత్యంత వైభంగా నిర్వహించనున్నారు.

రైలులో ప్రయాణిస్తూ వ్యక్తి మృతి



తుని: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే ముంబయి నుంచి విశాఖపట్నం వెళ్తున్న లోకమాన్య బాలగంగాధర్ తిలక్ రైలులో సుమారు 40 ఏళ్ల వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. ట్రైన్‌ను తునిలో ఆపి రైల్వే మెడికల్ ఆసుపత్రికి తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యాధికారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94906 29020 నంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు విడిగా అన్నదానం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో దివ్యాంగులకు, వృద్ధులకు శుక్రవారం నుంచి ప్రత్యేకంగా భోజనం పెడుతున్నారు. దీని కోసం అన్నదాన పథకం హాలు పై అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గతంలో ఇదేవిధంగా వీరికి విడిగా భోజనం పెట్టేవారు. అయితే వీరి కన్నా ఇతరులు ఎక్కువగా వచ్చి భోజనం చేస్తున్నారనే కారణంతో దానిని రద్దు చేశారు. అయితే, అందరితో పాటు క్యూలో నిలబడలేక వీరు ఇబ్బందులు పడుతున్నారనే విమర్శలు రావడంతో మళ్లీ విడిగా భోజనం పెడుతున్నారు. అయితే, అన్నదాన భవనం పై అంతస్తులోకి మెట్లు దిగి, ఎక్కలేక దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. అందువలన వారిని వీల్ చైర్స్‌పై అన్నదానం హాలు వరకూ తీసుకుని వెళ్లేలా ర్యాంపు నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే, అన్నదాన పథకంలో అందరికీ వడ్డించే ఆహార పదార్థాలు వేడిగా ఉంటాయి. ఇక్కడకు ముందుగానే వీటిని తీసుకురావడం వలన చల్లారి పోతున్నాయి. ఇక్కడ కూడా వేడిగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య


కవిత (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం మండలం పేరూరు శివారు కంసాల కాలనీలో వివాహిత సరెళ్ల కవిత (31) తన అద్దె ఇంట్లో చున్నీతో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు సరిగా తెలియకపోవడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కవిత పుట్టిల్లు అల్లవరం మండలం గూడాల కాగా, మెట్టినిల్లు పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం. ఆమె భర్త సునీల్ నర్సాపురంలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సీఐ పి.వీరబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన దూనబోయిన పెద్దిబాబు కవితకు కుటుంబ స్నేహితుడు. ఆమె తండ్రి జట్టు కూలీగా పనిచేసినప్పుడు పెద్దిబాబు సైతం అదే పనిలో ఉండడంతో అతనితో ఆ కుటుంబానికి స్నేహం ఏర్పడింది. కవితకు కుమారుడు, కుమార్తె ఉండి పట్టణంలో ఓ కాన్వెంట్‌లో చదువుతున్నారు. సునీల్ కుటుంబంతో ఆత్మీయంగా ఉండే పెద్దిబాబు కవిత పిల్లలకు కాన్వెంట్‌కు కేరియర్లు కూడా తీసుకు వెళుతూ ఆమెకు చేదోడు ఉంటాడు. శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య కవిత తలుపులు వేసి ఇంట్లో ఉరివేసుకున్న విషయం తెలుసుకున్న పెద్దిబాబు ఆ ఇంటి తలుపుల పగలగొట్టి కవితను రక్షించే ప్రయత్నం చేశాడు. ఆమెను తొలుత అత్యవసర వైద్యం కోసం పట్టణంలోనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే ఆమె మరణించింది. భార్య ఆత్మహత్య సమాచారం తెలుసుకున్న భర్త సునీల్ హుటాహుటిన తన అద్దె ఇంటికి చేరుకున్నాడు. కుటుంబీకులు, పెద్దిబాబును విచారిస్తున్నామని, కేసు దర్యాప్తులో కవిత ఏ కారణం వల్ల చనిపోయిందీ తేలుతుందని సీఐ వీరబాబు తెలిపారు. భర్త సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాన్వెంట్ నుంచి వచ్చిన పిల్లలు అమ్మ మరణంతో దిక్కుతోచకుండా రోదిస్తున్నారు. భర్త, ఇరుగుపొరుగు వారు ఈ పిల్లలను ఓదారుస్తున్న తీరు చూపరులను కలచి వేసింది. ఆ చిన్నారులను గూడాలలోని వారి అమ్మమ్మ ఇంటికి పంపించేశారు.

365 కేజీల గంజాయి పట్టివేత

- రూ.26.80 లక్షల సొత్తు స్వాధీనం
- ఏజెన్సీ నుంచి కేరళకు తరలించేందుకు యత్నం
- వ్యాన్ క్యాబిన్‌లో ప్రత్యేక ఏర్పాటు
- డ్రైవర్ అరెస్టు
- కీలక సూత్రధారి, మరికొందరి కోసం గాలింపు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, వ్యాన్, కారు, నిందితుడు

గండేపల్లి: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో పోలీసులు 365 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, రూ.26,79,750 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. కొద్ది రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలోని రంపచోడవరం పరిసర ప్రాంతాల నుంచి గంజాయి ముఠా సభ్యులు కారులో గంజాయి బస్తాలు తెస్తున్నారు. వీటిని గండేపల్లి మండలం ఎన్‌టీ రాజాపురం – కె.గోపాలపురం మార్గంలో అప్పటికే సిద్ధంగా ఉంచిన ఐషర్ వ్యాన్‌లో లోడ్ చేస్తున్నారు. దీని కోసం ఎవ్వరికీ అనుమానం కలగని రీతిలో వ్యాన్ క్యాబిన్‌లో ప్రత్యేక గదిలా ఏర్పాటు చేశారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి గంజాయి బస్తాలు తీసుకువచ్చి వ్యాన్‌లో లోడ్ చేశారు. వ్యాన్ బయలుదేరేందుకు అనుకూలమైన సమయం కోసం వేచి చూస్తున్నారు. ఆ మార్గంలో వెళ్తున్న వారు ప్రశ్నిస్తే వ్యాన్ పాడైందని, మెకానిక్‌ను తీసుకుని రావడానికి యజమాని వెళ్లాడని డ్రైవర్ చెప్పేవాడు. దీనిపై జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై యూవీ శివ నాగబాబు తన సిబ్బందితో కలసి ఒక్కసారిగా దాడి చేసి, 18 బస్తాల్లో ఉంచిన 365 కేజీల గంజాయితో సహా వ్యాన్, ఒక కారు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం ఎర్నాకుళం జిల్లాకు చెందిన డ్రైవర్ సబు చూత్తం పరంబిల్ దేవాస్సీని అరెస్టు చేసి, పెద్దాపురం కోర్టులో హాజరు పరచి, రిమాండుకు తరలించారు. గంజాయి తరలింపులో రాజమహేంద్రవరానికి చెందిన వ్యక్తి కీలక సూత్రధారి అని గుర్తించారు. అతడు ఏజెన్సీ నుంచి గంజాయి సేకరించి తమిళనాడుకు చెందిన వ్యక్తి ద్వారా కేరళలో ఉన్న మరో వ్యక్తికి పంపించేందుకు ప్రయత్నిస్తున్నాడు. పరారీలో ఉన్న ఈ ముగ్గురి కోసం పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యాన సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి తరలింపును అడ్డుకోవడంలో చురుకుగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రత్నగిరిపై భీష్మ ఏకాదశి సందడి


రత్నగిరి ఆవరణలో సేద తీరుతున్న వేలాది భక్తులు

అన్నవరం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం రత్నగిరి సత్యదేవుని దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నారు. రెండో శనివారం కావడంతో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శిస్తారని అంచనా వేస్తున్నారు. శుక్ర వారం సాయంత్రం నుంచి వేలసంఖ్యలో భక్తులు రత్నగిరికి చేరుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. కొంత మంది రామాలయం పక్కన గల విశ్రాంతి షెడ్డు లో విశ్రమించారు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి దేవస్థానానికి సుమారు పది వేల మంది వచ్చారు.

తెల్లవారుజాము నుంచి వ్రతాలు, దర్శనాలు

స్వామివారి దర్శనానికి తెల్లవారుజాము ఒంటి గంట నుంచే అనుమతిస్తారని, అలాగే వ్రతాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామివారి వ్రతం టిక్కెట్లు శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల నుంచి విక్రయిస్తున్నారు. దేవస్థానంలోని అన్ని చోట్ల షామియానాలు, భక్తుల కోసం మంచినీటి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈఈ వీర్ల సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


విద్యుద్దీపాలతో ప్రకాశిస్తున్న సత్యదేవుని రాజగోపురం

స్వామివారిని దర్శించిన 30 వేల మంది

కాగా శుక్రవారం 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. శుక్రవారం సుమారు రూ.30 లక్షలు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

బషీర్ బీబీ ఉరుసు ఉత్సవాలు ప్రారంభం


పొన్నాడలో బషీర్ బీబీని దర్శించుకుంటున్న భక్తులు


ఉత్సవాలను ప్రారంభిస్తున్న ముజావర్లు

భారీగా తరలి వచ్చిన భక్తులు

కొత్తపల్లి: మండలం పొన్నాడలో వేంచేసియున్న బషీర్‌బీబీ (బంగారు పాపమ్మ) ఔలియా ఉర్స్ 70వ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంథల్ (గంధం) తీసి అమ్మవారికి పూయడంతో ఉత్సవాలను ముజావర్లు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశం నలుమూల నుంచి కులమత భేదాలు లేకుండా వేలాది భక్తులు ఇప్పటికే పొన్నాడ చేరుకున్నారు. వీరంతా అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని మూడు రోజుల పాటు ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే వేలాది మంది పొన్నాడ చేరుకున్నారు. ఆదివారం జరిగే గంధోత్సవానికి అధికారుల భారీ ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ఎస్సై జి.వెంకటేష్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిత్యం ఖురాన్‌ఖాని, వాచ్, మిలాద్ షరీఫ్ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.


పొన్నాడలో బషీర్‌బీబీ దర్గా వద్ద ఉత్సవాలకు గంధం తీస్తున్న ముజావర్లు

ఏలేరు కాలువలో పడి వృద్ధుడి మృతి

కిర్లంపూడి: ఏలేరు కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై జి.సతీష్ మాట్లాడుతూ భూపాలపట్నానికి చెందిన రుద్దుల రామకృష్ణ (59) శుక్రవారం మధ్యాహ్నం బహిర్భూమికి ఏలేరు కాలువ గట్టు వద్దకు వెళ్లాడు. ముఖం తిరగడంతో కాలువలోకి జారిపడి కొట్టుకుపోయాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని కాలువలో గాలించగా కాలువ ఒడ్డున తుప్పల్లో విగతజీవిగా పడి ఉన్నట్టు గుర్తించి మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. శవపరీక్షల నిమిత్తం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు.


రామకృష్ణ మృతదేహం

మృతుడుకి భార్య, పెళ్లైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదు చేశారు.

దుర్గమ్మకు రూ.10 లక్షలతో వెండి చీర సమర్పణ


వెండి చీరలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

మండపేట: పట్టణంలోని సైథిల్‌పేటలో సత్తివారి ఇంట వెలసిన కనకదుర్గమ్మ తల్లికి రూ.10 లక్షలతో వెండి చీరను చేయించారు. ఆలయ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సత్తి వెంకన్న దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి వెండి చీరను అలంకరించారు. అమ్మవారు దేదీప్యమానంగా ఆకర్షణీయంగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మందిరం వద్ద కుంకుమార్చన, అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. నిర్వాహకులు సత్తి వెంకటేష్ మాట్లాడుతూ అమ్మ భక్తులు, దాతల సహకారంతో రూ.11 లక్షలు సమకూరగా అ కానుకలతో వెండి చీరను చేయించినట్టు తెలిపారు. అమ్మవారికి వెండిచీరను అలంకరించి మహిళలచే ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఐదు వేల మందికి అన్న ప్రసాద వితరణ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తనపై ఉత్తర్వులు జారీ

కొత్తపల్లి: విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని ఉన్నతాధికారులు శుక్రవారం సస్పెండ్ చేశారు. మండలంలోని కొత్త మూలపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు నడికి సుధీర్ ఐదో తరగతి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, తన సెల్‌ఫోన్‌లోని అసభ్య వీడియోలను చూపడం, వారిని తాకడం వంటివి చేసేవాడు. దీంతో విద్యార్థులు ఈ విషయాన్ని వారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏవీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఈ విషయాన్ని మండల విద్యాశాఖాధికారులు బి.వేణుగోపాల్, జి.పైడిరాజులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో విచారణ నిర్వహించి విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించి నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి అందించారు. నివేదిక ఆధారంగా సుధీర్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వేణుగోపాల్ తెలిపారు.

నేటి నుంచి పీఈటీ స్పోర్ట్స్ మీట్

- డీఎస్ఏలో ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా 700 మంది హాజరు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా వ్యాయామ ఉపాధ్యా సంఘం ఆధ్వర్యంలో ఏపీ పీఈటీ, పీడీ సంఘ సహకారంతో శనివారం నుంచి కాకినాడ జిల్లా క్రీడామైదానం, జేఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో పీఈటీ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు సైతం పూర్తి చేశారు. ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 700 మంది పీడీలు, పీఈటీలు హాజరు కానున్నారు. ఏర్పాట్లను రాష్ట్ర పీడీ, పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవిసుందర్ కౌర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీడీలకు సెమినార్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ షణ్మోహన్, డీఈఓ పి.రమేష్ డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ హాజరు కానున్నారని పోటీల నిర్వహణ కమిటీ కార్యదర్శి జార్జి తెలిపారు.

జీఎస్ఎల్‌కు పార్థివ దేహం అప్పగింత



రాజానగరం: సహజ మరణం పొందిన రాజమహేంద్రవరానికి చెందిన న్యాయ శాస్త్ర గ్రంథ రచయిత, వామపక్షవాది పెండ్యాల సత్యనారాయణ (72) పార్థివ దేహాన్ని శుక్రవారం స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలకు అప్పగించారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు వైద్య పరిశోధన కోసం ఈ వితరణ చేశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన స్వస్థలం గుంటూరు.